ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లా ఎన్నికల అధికారి షేక్ రిజ్వాన్ బాషా

జనగామ చౌరస్తా, మే 26 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో జజిల్లాలోని పట్టభద్రులంతా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో పురుష ఓటర్లు 14915 మంది, మహిళా ఓటర్లు 8503 మంది, థర్డ్ జెండర్ ఒకరితో కలిపి మొత్తం 23,419 ఓటర్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జిల్లావ్యాప్తంగా 27 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు షేక్‌రిజ్వాన్‌బాషా పేర్కొన్నారు. సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే విధంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటరు గుర్తింపు కార్డులేని వారు ఆధార్ కార్డుతో పాటు ఇతర 12 రకాల ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులతో ఓటు వేయాలని సూచించారు.

జనగామలో ఏడు పోలింగ్ కేంద్రాలు

జనగామ చౌరస్తా, మే 26 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నేపథ్యంలో జిల్లా కేంద్రంలో ఏడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. జనగామ పట్టణంలో 5,911 మంది పట్టభద్రులైన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో పురుష ఓటర్ల సంఖ్య 3,514 మంది ఉండగా, మహిళా ఓటర్లు 2,397 మంది ఉన్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. ఉప ఎన్నిక నిర్వహణ కోసం ఏడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో జిల్లా కోర్టు ఎదురుగా నున్న మండల ప్రజా పరిషత్ పాఠశాల (పీఎస్ నంబర్ 10), హనుమకొండ రోడ్డు ప్రెస్టన్ స్కూల్ (పీఎస్ నంబర్ 11), గిర్నిగడ్డ ఏబీవీ హైస్కూల్ (పీఎస్ నంబర్ 12), ధర్మకంచ జిల్లా పరిషత్ హైస్కూల్ (పీఎస్ నంబర్ 13), గణేశ్‌వాడ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ (పీఎస్ నంబర్ 14), రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల (పీఎస్ నంబర్ 15), కొత్తబస్తీ (గుండ్లగడ్డ) మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ (పీఎస్ నంబర్ 16)లో పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా ఏబీవీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో 1092 మంది ఓటర్లు, అత్యల్పంగా రైల్వే స్టేషన్ సమీపంలోని ప్రభుత్వ పాఠశాల పోలింగ్ కేంద్రంలో 586 మంది పట్టభద్రులైన ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

మృతుడి కుటుంబానికి రాజయ్య పరామర్శ

మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

లింగాలఘనపురం, మే 26 : మండల కేంద్రానికి చెందిన గట్టగల్ల కరుణాకర్ విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన నేపథ్యంలో మృతుడి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఆదివారం పరామర్శించారు. మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఏదునూరి వీరన్న, బోయిని యాదగిరిస్వామి, కేమిడి యాదగిరి, గట్టగల్ల నాగరాజు, ఉడుగుల భాగ్యలక్ష్మి, బెజ్జం అశోక్, దిల్‌యాకూబ్, ఎడ్ల తిరుపతి, ప్యాట రాజు, శ్రావణ్‌కుమార్, గట్టగల్ల అనిల్, గట్టగల్ల శ్రీహరి , కేమిడి వెంకటేశ్ పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న అంబర్‌కిశోర్‌ఝా కుటుంబ సభ్యులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF

jobs Apply Now!

★డయాలసిస్ టెక్నిషియన్స్, OT- టెక్నీషియన్స్, ఫార్మసీ బాయ్స్ మరియు GNM నర్సులు అనుభవం గలవారు కావలెను. సంప్ర: గార్డియన్ హాస్పిటల్, ములుగు 'X' రోడ్, వరంగల్. 12 to 2pm.
NTW-0383

HOUSE FOR SALE

★WGL, కొత్తవాడ, లక్ష్మీ గార్డెన్స్ దగ్గర 182 గ.ల.E/F ఇల్లు G.F 1BHK+2BHK, 1st ఫ్లోర్ 2BHK+2BHK, 2nd Floor, 1BHK పార్కింగ్ G.F. కార్ @3 Bikes,1బోర్, WMC వాటర్. సంప్ర|| 9490421153, 9652979107
KMM_11663

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
9182777557
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

బుగులు వెంకన్నకు సీపీ పూజలు

చిల్పూరు, మే 26 : మండల కేంద్రంలోని బుగులు వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆదివారం సాయంత్రంగా వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఆయనకు ఆలయ సిబ్బంది, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతించారు. అనంతరం స్వామివారికి అంబర్‌కిశోర్‌ఝా ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలను సీపీకి అర్చకులు అందించి శేష వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్, ఆలయ ప్రధాన అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్‌శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, సిబ్బంది రమేశ్, వీరన్న, మల్లికార్జున్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నల్లబెల్లి, మే 26: యువతి అదృశ్యమైన ఘటన మండలంలోని గొల్లపల్లెలో జరిగింది. గ్రామానికి చెందిన పనికర సారయ్య కూతురు మమత ఈ నెల 20న నర్సంపేటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం ఆమె తండ్రి సారయ్య ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామారావు విలేకరులకు తెలిపారు.

జనగామ నుంచి బస్సులో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బందితో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

జనగామ నుంచి మండలాల్లోని పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

చిల్పూరులోని పోలింగ్ బూత్ వద్ద తహసీల్దార్ సరస్వతి

నేడే ఎమ్మెల్సీ పోలింగ్..

- జిల్లాలో పట్టభద్రుల ఓటర్ల సంఖ్య 23,419
- మొత్తం పోలింగ్ కేంద్రాలు 27
- ఎన్నికల నిర్వహణకు పీవోలు 34 మంది, ఏపీవోలు 34 మంది నియామకం
- 32 మంది మైక్రో అబ్జర్వర్లతో పరిశీలన

జనగామ, మే 26 (నమస్తే తెలంగాణ) : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల శాసనమండలి స్థానానికి సోమవారం జరిగే ఉప ఎన్నికకు జిల్లా అధికార యంత్రాంగం సర్వ సన్నద్ధమైంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుండగా, ఇందుకోసం ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ ఎమ్మెల్సీ స్థానంలో వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో మొత్తం 4,63,839 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. వీరిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,73,413 మంది ఓటర్లున్నారు. జిల్లాలో జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్లతో కలిపి 23,419 పట్టభద్రులైన ఓటర్ల కోసం 27 పోలింగ్ స్టేషన్లు, 34 బ్యాలెట్ బాక్సులు ఏర్పాటు చేశారు. ఎన్నికల నిర్వహణకు 34 మంది పీవోలు, 34 మంది ఏపీవోలు, 74 మంది వోపీవోలు, 32 మంది మైక్రో అబ్జర్వర్లు విధుల్లో ఉన్నారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఈ ఎన్నికలో గ్రాడ్యుయేట్లు అంకెల రూపంలో తమ ప్రాధాన్యతా ఓట్లను వేయనున్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని పర్యవేక్షిస్తారు. మొత్తం 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల మధ్యే పోటీ నెలకొంది. ఈ ఉప ఎన్నికలో అన్ని పార్టీల కీలక నేతలంతా ప్రచారం చేశారు. మొన్నటి వరకు తాను ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహించిన పట్టభద్రుల నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరుగుతుండడంతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకొని మూడు ఉమ్మడి జిల్లాల్లో అంతా తానై బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి గెలుపు కోసం విస్తృత ప్రచారం చేశారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య సైతం ముమ్మరంగా ప్రచారం చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటింగ్ నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. పోలీసు భద్రత మధ్య పోలింగ్ నిర్వహించేందుకు బలగాలను మోహరించారు.

కామారెడ్డిగూడెంలో పోలింగ్ సిబ్బంది

సీసీ కెమెరాల్లో ఓటింగ్ సరళి రికార్డు..

ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ సరళిని మొత్తం సీసీ కెమెరాలో రికార్డు చేయనున్నారు. ఎన్నికల విధుల్లో పీవో, ఏపీవో, ఓపీవోలు ఇప్పటికే కలెక్టరేట్‌లోని పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎన్నికల సామగ్రిని సిబ్బందికి అందజేసి బందోబస్తు మధ్య ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాల్గొనే ఓటర్లు గుర్తింపుకార్డుగా 12 రకాల కార్డులను వినియోగించవచ్చని ఎన్నికల అధికారులు తెలిపారు. ఎపిక్‌కార్డు లేని వారు ఆధార్‌కార్డు, ఈజీఎస్ జాబ్‌కార్డు, బ్యాంకు లేదా పోస్టాఫీసు పాస్‌బుక్, ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్టు కార్డు, పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ఉద్యోగులు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ సంస్థల ఉద్యోగులకు జారీ చేసిన ఫొటో ఐడీ కార్డులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు జారీ చేసిన ఐడీ కార్డులు, ప్రత్యేక వైకల్యం ఐడీకార్డు(యూడీఐడీ)లలో ఏదో ఒకదానితో ఓటు వేయవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా తెలిపారు.

పోలింగ్ కేంద్రాలకు సామగ్రి తరలింపు

జనగామ చౌరస్తా : వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక నేపథ్యంలో ఆదివారం కలెక్టరేట్‌లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సామాగ్రిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా సమక్షంలో తరలించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రిసైడింగ్ అధికారులు (పీవో), అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు (ఏపీవో), అదర్ ప్రిసైడింగ్ అధికారులను (ఓపీవో) పోలింగ్ సామగ్రితో సహా పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు పంపారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి రిజ్వాన్ బాషా మాట్లాడుతూ చెక్ లిస్ట్ ఆధారంగా పోస్టల్ బ్యాలెట్ పేపర్లు, ఓటింగ్ కంపార్ట్‌మెంట్లు, ఇతర సంబంధిత ఎన్నికల సామగ్రిని పరిశీలించి సరిచూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, కలెక్టరేట్ ఏవో రవిందర్, మన్సూరి పాల్గొన్నారు.

నర్మెటలోని పోలింగ్ బూత్ వద్ద ఎన్నికల సిబ్బంది

జఫర్‌గఢ్‌లోని పోలింగ్ కేంద్రం వద్ద ఎన్నికల సిబ్బంది

నర్మెటలో..

నర్మెట : మండల కేంద్రంలోని పోలింగ్ బూత్‌లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మొత్తం 1056 పట్టభద్రులకు గాను పురుషులు 688, మహిళలు 368 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నర్మెట పోలింగ్ స్టేషన్‌లో పీవో, ఏపీవో, ముగ్గురు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నట్లు తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

దేవరుప్పలలో..

దేవరుప్పుల : మండలంలోని ఓటర్లకు కామారెడ్డిగూడెంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సెక్టోరియల్ ఆఫీసర్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా, 1,866 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తెలిపారు. 30వ బూత్‌లో 1040 మంది, 31వ బూత్‌లో 826 మంది ఓటు వేయనున్నారని వివరించారు. ఒక్కో బూత్‌లో ఐదుగురు పోలింగ్ సిబ్బంది ఉంటారని ఆయన తెలిపారు.

పాలకుర్తిలో..

పాలకుర్తి రూరల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ టీ వెంకటేశం తెలిపారు. 27వ నంబర్ పోలింగ్ బూత్‌లో 805 ఓట్లు, 28వ నంబర్ పోలింగ్ బూత్‌లో 1021 ఓట్లు, 29వ నంబర్ పోలింగ్ బూత్‌లో 678 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఆయన తెలిపారు. మండలంలో మొత్తం 2504 ఓట్లు ఉన్నాయని వివరించారు.

జఫర్‌గఢ్‌లో..

జఫర్‌గఢ్ : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నట్లు మండల రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ ఆంజనేయులు తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లలో ఓటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ఓటర్లు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సరస్వతి తెలిపారు. మండలంలోని 17 గ్రామాలకు చెందిన 1,154 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారని ఆమె పేర్కొన్నారు. ఎస్సై ముత్యం రాజేందర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కల్వల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన ఏసీపీ

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ నర్సయ్య

కొడకండ్ల, మే 26 : మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని వర్ధన్నపేట ఏసీపీ అంబాల నర్సయ్య ఆదివారం పరిశీలించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల పట్టభద్రులు సోమవారం ఓటు హక్కు వినియోగించుకుంటారని తెలిపారు. ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అంజయ్య, ఎస్సై శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.



కొన్నె ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థులు

చిన్నపెండ్యాలలో నాటి: గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

- నాడు పాఠాలు బోధించిన గురువులకు ఘన సన్మానం
- కొన్నె, చిన్నపెండ్యాలలో వేడుకలు

బచ్చన్నపేట, మే 26 : మండలంలోని కొన్నె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000-2001 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాడు చదువు చెప్పిన గురువులను సత్కరించారు. పాఠశాలలో నాడు జరిగిన ఘటనలను గుర్తు చేసుకున్నారు. తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పాఠశాల అభివృద్ధికి తమవంతు సహకారం అందించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ప్రతి ఏడాది ఇలా కలుసుకోవాలని తీర్మానించుకున్నారు.. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సిద్ధిరాములు, నర్సయ్య, రమేశ్, బాలకిషన్, పృథ్వీరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, వీరంజని, జానీ తదితరులు పాల్గొన్నారు.

చిల్పూరులో..

చిల్పూరు : మండలంలోని చిన్నపెండ్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-1999 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యర్థులు ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరి నొకరు శుభాకాంక్షలు తెలుపుకుని చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాడు విద్యా బోధన అందించిన గురువులు తిరుపతిరెడ్డి, మహేంద్రాచారిని ఘనంగా సత్కరించారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తెలిపారు. ఇందుకోసం మరోసారి సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో దారం సతీశ్, భూక్య శ్నీవాస్,నారాయణగిరి రాజు, ఎలిగేటి రాజు,తాళ్లపల్లి నాగరాజు, తాళ్లపల్లి శ్రీనివాస్, సతీశ్, తోట్టె కుమార్, నలబాల కుమార్, రాజు, ఎడ్ల రమేశ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న నర్మద

తొర్రూరు, మే 26: పాఠశాలలు పునఃప్రారంభ సమయం సమీపిస్తున్న తరుణంలో అభివృద్ధి పనులను నాణ్యతతో పూర్తి చేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో నర్మద ఆదేశించారు. ఆదివారం మండలంలోని వెంకటాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యుత్, సివిల్ పనులను ఆమె పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, ప్రధానోపాధ్యాయులు జూన్ ఒకటి వరకు ఖచ్చితంగా పనులను పూర్తి చేయించాలని, లేకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆదేశాలతో చేపడుతున్న పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూర్తి చేసి నూతన విద్యా సంవత్సరంలో ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సిలార్ సాహెబ్, పాఠశాల హెచ్ఎం స్వాతి, ఏఈ రవితేజ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మాధవి పాల్గొన్నారు.

'గ్రామీణ వైద్యులపై దాడులు మానుకోవాలి'

తొర్రూరు, మే 26: ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ప్రాథమిక చికిత్స చేస్తున్న గ్రామీణ వైద్యులపై దాడులు మానుకోవాలని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనపురపు వెంకన్నగౌడ్, తొర్రూరు మండల గౌరవాధ్యక్షుడు సింగారపు భీమయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ధర్మారపు హనుమంతు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో వెయ్యి మందికి ఒక ప్రభుత్వ వైద్యుడిని నియమిస్తే తాము స్వచ్ఛందంగా ప్రథమ చికిత్స చేయడం మానుకుంటామన్నారు. లేకుంటే సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, సీనియర్ గ్రామీణ వైద్యుడు కడియం విశ్వనాథం, మండల కమిటీ సభ్యులు గడ్డం రాజమౌళి, భిక్షపతి, ఐలయ్య, వెంకటేశ్, పెద్ది అనిల్, మనోహర్ పాల్గొన్నారు.

ప్రేమికుడి ఇంటి ఎదుట యువతి ధర్నా

చెన్నారావుపేట, మే 26: ప్రేమించి పెళ్లికి నిరాకరిస్తున్న ప్రేమికుడి ఇంటి ఎదుట ఓ యువతి ధర్నా చేసిన ఘటన వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల కథనం ప్రకారం.. చెన్నారావుపేటకు చెందిన దొంతి రుచిత(23), ఇదే గ్రామానికి చెందిన మజ్జిక అన్వేశ్ ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. పెళ్లిమాట ఎత్తేసరికి అన్వేశ్ తప్పించుకుంటున్నాడు. పెద్ద మనుషుల సమక్షంలో పెళ్లికి ఒప్పుకొని ఇప్పుడు మూడు నెలల సమయం కావాలంటూ దాటవేస్తున్నాడని ఆమె ఆరోపించింది. కాగా, మహిళా సంఘం నాయకులు యువతికి మద్దతు తెలిపారు.

అన్వేశ్ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న రుచిత

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

అమ్మవారికి మొక్కులు చెల్లిస్తున్న నిడిగొండ నరేశ్‌కుమార్

బచ్చన్నపేట, మే 26 : మండలంలోని లక్ష్మాపూర్‌లో దుర్గామాత ఉత్సవాలు రెండు రోజులు ఘనంగా జరిగాయి. వేడుకల్లో భాగంగా ఆదివారం గ్రామ ప్రజలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. మహిళలు బోనాలు సమర్పించి ప్రజలందరినీ చల్లంగ చూడు తల్లీ అని వేడుకున్నారు. అమ్మవారిని వాస్విక్ ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేశ్‌కుమార్, వైస్‌చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నూకల నవ్యానర్సిరెడ్డి దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లారు. రెండు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో ఎలాంటి అవాంచనీయం ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఆగాపేటలో యజ్ఞం నిర్వహిస్తున్న భక్తులు

హనుమాన్ భక్తుల పూజలు

నర్మెట, మే 26: మండలంలోని ఆగాపేట ఆంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం హనుమాన్ యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్తులు స్వామివారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. తొలుత గణపతి పూజ చేసిన అనంతరం యజ్ఞాన్ని కొనసాగించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు, వేదపండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

జఫర్‌గఢ్, మే 26 : విత్తనాల కొనుగోలులో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవోలు ప్రశాంత్, శిరీషా సూచించారు. ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయశాఖ ద్వారా జారీ చేసిన లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. దీనికి సంబంధించి రశీదు తీసుకోవాలని, పంట రకం, లాట్ నంబర్, డీలర్ సంతకం తీసుకోవాలన్నారు. ఖాళీ విత్తన ప్యాకెట్లను, బిల్లులను పంట దిగుబడి వచ్చే వరకూ రైతులు భద్రంగా దాచుకోవాలని వారు కోరారు. గ్రామాల్లో విత్తనాలు అమ్మడానికి ఎవరైనా వస్తే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కాశీబుగ్గ, మే 26: వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తుమ్మ గోపి తెలిపారు. ఈ నెల 7న సుమారు 50 ఏ